

నేటి నుంచి రీసర్వే

జిల్లాలో భూముల రీసర్వేను సోమవారం నుంచి ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. - 8లో



ఫోరెన్సిక్ ల్యాబ్ ప్రారంభం


తిరుపతిలో ఫోరెన్సిక్ ల్యాబ్‌ను విజయవాడ నుంచి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వర్చువల్‌గా ప్రారంభించారు. - 8లో



తిరుపతిలో 'సంక్రాంతికి వస్తున్నాం'

సంక్రాంతికి వస్తున్నాం సినిమా యూనిట్ ఆదివారం తిరుపతిలో సందడి చేసింది. ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపింది. - 8లో

పంచాయతీపై పచ్చ పడగ



పంచాయతీలపై కూటమి నేతలు విషం గక్కుతున్నారు. ప్రజా ధనం దోచుకునేందుకు నిస్సిగ్గుగా కుట్రలు పన్నుతున్నారు. అందులో భాగంగా తొలుత పల్లె పండుగ పేరుతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు నానా హంగామా చేశారు. ఈక్రమంలో గ్రామ ప్రథమ పౌరుడిగా బాధ్యతలు నిర్వర్తించే సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు. వారి అధికారాలను హరించేందుకు రాత్రికి రాత్రే జీఓలను జారీ చేయించేశారు. కార్యదర్శులను అడ్డం పెట్టుకుని ఖాళీ పేపర్లపై ఏకపక్ష తీర్మానాలను సృష్టించేశారు. ఈ మేరకు మంజూరైన పనులను ఎమ్మెల్యే సూచించిన నేతలకు కట్టబెట్టేశారు. ఇదేం అన్యాయమని సర్పంచ్‌లు ప్రశ్నిస్తే.. తాము ఏం చేయలేమని అధికారులు చేతులెత్తేశారు.

ఉత్సవ విగ్రహాలుగా సర్పంచ్‌లు

- పల్లె పండుగ పేరుతో దోపిడీకి టీడీపీ నేతల కుట్రలు
- ఎమ్మెల్యేలు చెప్పిన వారికే పనులు
- కార్యదర్శులు ద్వారా ఏకపక్ష తీర్మానాలు
- సర్పంచ్‌లను అణగదొక్కి అధికారాలకు కోత
- కూటమి నేతల కబంధహస్తాల్లో గ్రామ స్వరాజ్యం

జిల్లాలో నియోజకవర్గాల వారీగా కేటాయించిన పనులు, నిధుల వివరాలు

నియోజకవర్గం	పంచాయతీలు	పల్లె పండుగ పనులు	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)
గూడూరు	122	273	17.45
వెంకటగిరి	143	167	8.05
శ్రీకాళహస్తి	141	179	8.42
సత్యవేడు	169	309	19.68
చంద్రగిరి	108	464	51.20
సూళ్లూరుపేట	128	203	20.50

వరదయ్యపాళెం: జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను కూటమి నేతలకు దోచిపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం పల్లె పండుగ కింద గుర్తించిన పనులను తమ నేతలకు అప్పగించేలా పన్నాగాలు అమలు చేసింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచ్‌ల అధికారాలను తొలగించేసింది. పంచాయతీల్లో కార్యదర్శుల ద్వారా తీర్మానాలు చేయించి, కూటమి నేతలకు రూ.కోట్ల పనులను కట్టబెట్టింది. ఎన్నికల సమయంలో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రమైన విమర్శలు చేశారు. సర్పంచ్‌లను పక్కపెట్టారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే సర్పంచ్‌లకు రెట్టింపు అధికారాలు ఇస్తామని పగల్బాలు పలికారు. ఒక్కో పంచాయతీకి రూ.కోటి పైగా నిధులు కేటాయిస్తామని ఊకదంపుడు మాటలు వల్లించారు. తీరా అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు తన సహజ వైఖరిలోనే వ్యవహరిస్తున్నారు. స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలవడమే ఇందుకు కారణమని, అందుకే కూటమి ప్రభుత్వం ఇంతటి దారుణంగా నిర్ణయాలు తీసుకుంటోందని గ్రామీణులు విమర్శిస్తున్నారు.

జేబులు నింపుకునేందుకే..

పల్లె పండుగ పనులు కూటమి నేతల జేబులు నింపుకునేందుకు అనుకూలంగా మారాయి. జిల్లాలోని 6 నియోజకవర్గాల్లో 811 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆ పంచాయతీలకు సంబంధించి పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, ఇతర పనుల నిర్మాణం కోసం రూ. 130.88 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.ఈ పనులు చేపట్టేందుకు గత ఏడాది ఆగస్టు 23న పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సమయంలోనే సందట్లో సడేమియ అన్నట్లు ఖాళీ పేపర్లలో తీర్మాన పత్రాలపై కూటమి నేతలు ఆయా పంచాయతీల సభ్యులతో సంతకాలు చేయించేసుకున్నారు. తమ పార్టీ నేతల జేబులు నింపుకునేందుకు సంబంధిత పనులు అప్పగించేశారు.

చట్ట విరుద్ధంగా పనుల కేటాయింపు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టాలంటే స్థానిక సర్పంచ్, పాలకవర్గం తీర్మాన పత్రం తప్పనిసరి. మంజూరైన పనులను ఎవరు చేసినా బిల్లులకు సంబంధించి నిధులు మాత్రం సర్పంచ్, కార్యదర్శి ఉమ్మడి ఖాతాలో జమ అవుతాయి. అయితే చట్ట విరుద్ధంగా కూటమి సర్కారు అక్రమ జీఓలను ప్రవేశపెట్టింది. గ్రామ సభలకు సర్పంచులు హాజరుకాకపోయినా వారి స్థానంలో సీనియర్ సిటిజన్స్, ఉప సర్పంచుల ద్వారా తీర్మాన పత్రాలను సిద్ధం చేయవచ్చని పేర్కొంది. ఇదే అదునుగా స్థానిక ఎమ్మెల్యే రంగంలోకి దిగి తీర్మానాలు చేయించి, పనుల పందేరం పూర్తి చేసేశారు.



వరదయ్యపాళెం మండలంలో టీడీపీ నేత నిర్మించిన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు



సత్యవేడు నియోజకవర్గం కేవీబీపురం మండలంలో నిర్మించిన సీసీ రోడ్డు వద్ద టీడీపీ నేతలు

ఏకపక్ష నిర్ణయాలు



వరదయ్యపాళెం మండలంలో 29 గ్రామ పంచాయతీలకు సంబంధించి 32 పనులు పల్లె పండుగ ద్వారా మంజూరు చేశారు. ఈ పనులకు రూ.1.7 కోట్లను ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేశారు. అయితే గ్రామసభలు జరిగిన సమయంలో ఉపాధి హామీ ద్వారా మంజూరయ్యే పనులన్నీ సర్పంచ్‌లే చేయాలని తీర్మానపు పత్రాలలో సర్పంచ్‌ల ద్వారా సంతకాలు చేయించుకున్నారు. పనులు మంజూరయ్యాక కూటమి నేతలకు కట్టబెట్టడం సరైన పద్ధతి కాదు.

–చంద్రారెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, వరదయ్యపాళెం మండలం

గౌరవం లేదు



పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాం. సజావుగా సాగుతున్న పాలనలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వడం లేదు. కూటమి నేతల పెత్తనం ఎక్కువైంది. తమతో పని లేకుండా అధికారులు కూడా కూటమి నేతలకే వత్తాసు పలుకుతున్నారు. నా పంచాయతీ పరిధిలో 2 సీసీ రోడ్లు, మరో 2 క్యాటిల్ షెడ్లు మంజూరైనప్పటికీ సర్పంచ్‌గా నాకు ఏమాత్రం సమాచారం లేకుండా నిర్మించుకున్నారు.

–ఇనమల శీనయ్య, సర్పంచ్, కందుకూరు, గూడూరు మండలం

అధికారాలకు చెల్లుచీటీ



కూటమి ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోంది. అందుకు ఇదే నిదర్శనం. గ్రామ సర్పంచ్‌ల అధికారాలకు నిలువునా తూట్లు పొడుస్తోంది. గ్రామాల్లో గతంలో సర్పంచ్ తీర్మానాల మీదనే అభివృద్ధి పనులను చేపట్టాల్సి ఉండేది. ఇప్పుడు అందుకు విరుద్ధంగానే పనులు చేస్తున్నారు. ఇక సర్పంచ్‌లు ఎందుకు?.

–గుంటమడుగు గీతాంజలి, సర్పంచ్, రాజులఎరుగుంటపాళెం, సైదాపురం మండలం, వెంకటగిరి నియోజకవర్గం

విలువ లేదు



కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సర్పంచ్‌ల ప్రమేయం లేకుండానే గ్రామాల్లో పనులు చేస్తున్నారు. అందుకు మండల స్థాయి అధికారులు కూడా సై అంటున్నారు. ఎన్నికల ముందు సర్పంచ్‌లకు విస్తృత అధికారాలు ఇస్తామని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ హామీ తుంగలో తొక్కారు. గ్రామాల్లో షాడోల పెత్తనం చలాయిస్తున్నారు.

–యల్లంరాజు వరప్రసాద్‌రాజు, సర్పంచ్, లింగసముద్రం, సైదాపురం మండలం, వెంకటగిరి నియోజకవర్గం

అధికారుల అత్యుత్సాహం



కూటమి ప్రభుత్వంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. మా పంచాయతీలో పలు సీసీ రోడ్ల నిర్మాణం కోసం గ్రామ సభ ద్వారా అవసరమున్న చోట రోడ్ల నిర్మాణానికి తీర్మాణం చేశాం. అయితే స్థానిక ఇంజినీరింగ్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి ఎలాంటి పదవులు లేని అధికార పార్టీ చోటా నేతల కనుసన్నల్లో పనులు అప్పగిస్తున్నారు. ఎప్పుడూ లేని విధంగా కొత్తగా విష సంస్కృతికి బీజం వేస్తున్నారు.

–చిన్ని యాదవ్, సర్పంచ్, వెంకటపతినగర్, తిరుపతి రూరల్

హక్కులు కాలరాయడమే



కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పనులను గ్రామాలలో చేపట్టాలంటే పంచాయతీ తీర్మానం, సర్పంచ్ అనుమతి తప్పనిసరిగా ఉండేది. అయితే ప్రభుత్వం సర్పంచుల హక్కులను కాలరాస్తోంది. వారి పార్టీ నాయకులకు ఉపాధి పనులను కట్టబెట్టేందుకు సర్పంచ్‌ల వ్యవస్థలను నిర్వీర్యం చేయడం దారుణం.

–వెంపళ్ల సురేంద్ర యాదవ్, సర్పంచ్, రెడ్డిపల్లె, శ్రీకాళహస్తి మండలం

న్యూస్‌రీల్

అధికార నందికి విశేష పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికార నందికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. కుంభాభిషేకంలో భాగంగా కలశ పూజ, పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం అధికార నందికి విశిష్ట అభిషేకం జరిపించి ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు . కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వేమన జయంతి



వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్, తదితరులు

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో ఆదివారం ఘనంగా యోగి వేమన జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్ఓ నరసింహులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేమన పద్యాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సరళమైన భాషలో ఆయన రచించిన వేమన శతకం చరిత్రకెక్కిందని తెలిపారు. సమాజంలోని భిన్న కోణాలను ఆయన తన పద్యశతకంలో ఆవిష్కరించారని వెల్లడించారు. అందుకే ప్రభుత్వం ఏటా జనవరి 19వ తేదీన రాష్ట్ర పండుగగా వేమన జయంతిని నిర్వహిస్తున్నట్లు వివరించారు.

నేటి నుంచి విద్యాసంస్థలు పున:ప్రారంభం

తిరుపతి సిటీ: సంక్రాంతి సెలవులు ముగిశాయి. సుమారు పది రోజుల పాటు ప్రభుత్వ, టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. సెలవులు పూర్తయిన నేపథ్యంలో సోమవారం నుంచి యథావిధిగా విద్యాసంస్థలు ప్రారంభం కానున్నాయి.

వీక్షిద్దామా.. విహంగామా!

వలస పక్షులను వీక్షించేందుకు వందలాదిగా పర్యాటకులు తరలివచ్చారు. ఆదివారం సెలవుదినం కావడంతో పెద్దసంఖ్యలో పోటెత్తారు. విదేశీ విహంగాల సందడిని పరిశీలించి పరవశించారు. ఉత్సాహంగా బోటులో షికారు చేసి మురిసిపోయారు. ఆహ్లాదకర వాతావరణంలో పక్షుల కిలకిలరావాల నడుమ సేదతీరారు. ఫ్లెమింగ్ ఫెస్టివల్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీలను తిలకించి క్రీడాకారులను అభినందించారు.

- కోలాహలంగా ఫ్లెమింగో ఫెస్టివల్
- రెండోరోజు పోటెత్తిన పర్యాటకులు
- హోరాహోరీగా సాగిన ఆటల పోటీలు



సూళ్లూరుపేట : ఫ్లెమింగో ఫెస్టివల్–2025కు రెండోరోజు ఆదివారం పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతో పాటు చిత్తూరు జిల్లాకు చెందిన సందర్శకులు, స్కూల్ విద్యార్థులు తరలిరావడంతో ఇటు సూళ్లూరుపేట, అటు నేలపట్టు పక్షుల కేంద్రం, భీములవారిపాళెం పడవల రేవు, అటకానితిప్ప పర్యావరణ విజ్ఞానకేంద్రం జనాలతో కిక్కిరిసింది. ముందుగా సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎగ్జిబిషన్ స్టాల్స్, రంగులరాట్నాలు ఏర్పాటు చేయడంతో సందర్శకులు తాకిడి ఎక్కువగా కనిపించింది. అటకానితిప్ప పర్యావరణ విజ్ఞానకేంద్రంలో పర్యాటకులు పక్షులకు సంబంధించి ఫిల్మ్‌షో వీక్షించారు. అలాగే మ్యూజియం చూసేందుకు బారులు తీరారు. ముఖ్యంగా నేలపట్టులో పక్షులను వీక్షించేందుకు, భీములవారిపాళెం పడవల రేవులో బోట్ షికారు చేసేందుకు అధికంగా ఆసక్తి చూపించారు. ఈ క్రమంలోనే సూళ్లూరుపేట ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. శ్రీహరికోట- సూళ్లూరుపేట మార్గంలో ఇరువైపులా పులికాట్ సరస్సులో ఫ్లెమింగోలు, పెయింటెడ్ స్టార్క్స్ ప్రకృతి ప్రియులకు కనులవిందు చేశాయి. సరస్సులో నీరు తక్కువగా వుండడంతో పక్షులు రోడ్డుకు పక్కనే గుంపులు గుంపులుగా దర్శనమివ్వడంతో పర్యాటకులు ఆశ్చర్యానందానికి గురయ్యారు. నేలపట్టు పక్షులు కేంద్రంలో గూడబాతులు, నత్తగుల్ల కొంగలు, తెల్ల కంకణాయిలు, తెడ్డుముక్కుకొంగలు, పలు రకాల బాతు జాతి పక్షుల సందడి ఆకట్టుకుంటోంది.

షార్ సందర్శనకు నో పర్మిషన్

ఫ్లెమింగో ఫెస్టివల్‌కు వచ్చిన పర్యాటకులు షార్ సందర్శనకు అవకాశం లేకుండా పోయింది. ఈనెల 29న జీఎస్ఎల్‌వీ ఎఫ్15 ప్రయోగించనున్న నేపథ్యంలో భద్రతా కారణాల వల్ల షార్ అధికారులు అనుమతి నిరాకరించారు. దీంతో పర్యాటకులు బయట నుంచే షార్ కేంద్రం ఫొటోలు తీసుకుని వెళుతున్నారు.





తమ మాటలతో ఆకట్టుకుంటున్న యాంకర్లు

ఉచిత బస్సులు

సూళ్లూరుపేటకు వచ్చిన పర్యాటకులు నేలపట్టు, అటకానితిప్పకు, భీములవారిపాళెం పడవల రేవు, శ్రీసిటీ పారిశ్రామికవాడకు వెళ్లేందుకు ఉచితంగా బస్సులు నడిపారు. ఇందుకోసం స్థానిక స్కూళ్లు, కళాశాలలకు చెందిన ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఖర్చులు కూడా ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలే భరించినట్లు తెలిసింది.



సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న జనం

షికారు.. హుషారు

ఫ్లెమింగో ఫెస్టివల్‌లో భాగంగా తడ మండలం భీములవారిపాళెం పడవల రేవు వద్ద బోట్ షికారుకు సందర్శకులు పోటెత్తారు. పులికాట్‌లో విహరిస్తూ హుషారుగా కాలక్షేపం చేశారు.





బోటులో పర్యటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

క్లుప్తంగా

ఏనుగుల దాడితో ఉప సర్పంచ్ మృతి

చంద్రగిరి : మండలంలో శనివారం రాత్రి ఏనుగుల దాడిలో కందులవారిపల్లె ఉప సర్పంచ్ రాకేష్ చౌదరి(33 మృతి చెందాడు. ఆదివారం ఆయన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామం మామిడిమానుగడ్డకు తరలించారు. దీనిపై సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, రైతు సంఘాల నేతలు గ్రామానికి చేరుకుని రాకేష్ భౌతికకాయానికి నివాళులర్పించారు. గ్రామస్తులు, బంధుమిత్రుల అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు జరిపించారు. ఈ సందర్భంగా ఏపీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు మాట్లాడుతూ అటవీ అధికారులు నిర్లక్ష్యం కారణంగానే ఉప సర్పంచ్ రాకేష్ మృతి చెందాడని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి రూ.25లక్షల పరిహారం, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నేతలు పద్మనాభరెడ్డి, గోవింద స్వామి, శివారెడ్డి మాట్లాడుతూ ఏనుగుల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగల చోరీ



తిరుపతి అర్బన్ : శ్రీకాళహస్తి మండలం పోలి గ్రామంలో ఆదివారం వేకువజామున గుర్తుతెలియని వ్యక్తులు ఓ ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టారు. అందులోని రాగి తీగలను అపహరించారు. దీనిపై స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రాన్స్ ఫార్మర్ ఆధారంగా 12 ఎకరాలకు పైగా నలుగురు రైతులు సేద్యం చేస్తున్నారని వెల్లడించారు. బాధిత రైతు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ వెంటనే అధికారులు స్పందించి ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయకుంటే తమ పంటలు ఎండిపోయే ప్రమాదముందని వాపోయారు. పోలీసులు సైతం చోరీలకు పాల్పడే వారిని అదుపులోకి తీసుకోవాలని కోరారు.

మృత్యువు ఎదురుదాడి!

ఆ తిరుమలేశుడిని దర్శించి పునీతులవ్వాలని తలచారు. ఆపదమొక్కుల వాడి కొండకు వెళ్లి మొక్కులు చెల్లించుకోవాలని భావించారు. అనంతశయుడిని ఆశ్రయించి సకల పాపాలు తొలగించుకోవాలని ఆరాటపడ్డారు. కానీ దారి కాచిన మృత్యువు మార్గమధ్యంలోనే కబళించింది. ఇద్దరు చిన్నారులతోపాటు ఓ మహిళ ప్రాణాన్ని పొట్టనబెట్టుకుంది. మరో ముగ్గురికి రక్తగాయాలు చేసి ఆస్పత్రి పాలు చేసింది. ఈ విషాద ఘటన ఆదివారం చంద్రగిరి మండలంలో విషాదాన్ని మిగిల్చింది.



ఆస్పత్రిలో జీవన్, విశ్వ మృతదేహాలు

- జక్కావారిపల్లె వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- తిరుమలేశుడి దర్శనానికి వస్తూ ఘటన
- లారీని ఢీకొట్టిన కారు
- ముగ్గురు మృతి
- ఇందులో ఇద్దరు చిన్నారులు
- మరో ముగ్గురి పరిస్థితి విషమం

చంద్రగిరి: పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి పనపాకం పంచాయతీ జక్కలవారిపల్లి వద్ద ఆదివారం సాయంత్రం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు, కోయంబత్తూరుకు చెందిన కార్తికేయ తన కుటుంబంతో కలసి తిరుమల శ్రీవారి దర్శనార్థం కారులో తిరుమలకు బయల్దేరాడు. పనపాకం రహదారి టోల్‌గేటు దాటుకుని జక్కలవారిపల్లి వద్ద వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కార్తికేయ కుమారులు జీవన్(10), విశ్వ(06) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న కార్తికేయ సతీమణి ఐశ్వర్య, బావమరిది సతీష్, అత్త కళైవాణి తీవ్రంగా గాయపడ్డారు. తోటి ప్రయాణికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కారులో నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కళైవాణి మృతిచెందారు. క్షతగాత్రుల పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

భారీగా ట్రాఫిక్ జామ్

రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రెండు కిలోమీటర్ల మేర వాహన రాకపోకలు ఆగిపోయాయి.

మృత్యుదారి

జాతీయ రహదారి రోడ్డు నిర్మాణ పనులు ఇంకా పూర్తికాలేదు. పనపాకం నుంచి జక్కలవారిపల్లి వరకు జాతీయ రహదారి పనులు నిలిచిపోయాయి. దీంతో తాత్కాలికంగా హైవే అధికారులు సింగిల్ రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ సింగిల్‌ను తెలియజేసేలా ఎటువంటి సూచక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఈ క్రమంలో టోల్‌గేటు దాటిన 200 మీటర్ల దూరంలో సింగిల్ రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.



చికిత్స పొందుతూ మృతి చెందిన కళైవాణి



గాయపడిన ఐశ్వర్య



చికిత్స పొందుతున్న కార్తికేయ

ఘటనా స్థలానికి సీఐ సుబ్బారామిరెడ్డితో పాటు తన బృందం చేరుకుంది. ప్రమాదానికి గురైన వాహనాలను పోలీసులు పక్కకు తీశారు. అనంతరం సుమారు రెండు గంటల పాటు శ్రమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ముందు వెళ్తున్న వాహనాన్ని కారు అధిగమించే క్రమంలోనే ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టినట్టు విచారణలో తెలిసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్స్‌లో టీటీడీ ఈవో తనిఖీ



స్విమ్స్‌లో వైద్యులతో మాట్లాడుతున్న ఈవో, జేఈవో

తిరుపతి తుడా/తిరుపతి కల్చరల్ : టీటీడీ ఈవో శ్యామలరావు జేఈవో వీరబ్రహ్మం ఆదివారం స్విమ్స్ ఆస్పత్రిలో తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. వార్డుల్లో ఆయా షిఫ్టుల్లో విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది వివరాలను సూచిక బోర్డుల్లో తప్పనిసరిగా పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి లోపల, బయట పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్విమ్స్‌లోని అత్యవసర సేవల విభాగం, నెఫ్రాలజీ వార్డు, ఐసీయూ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, కార్డియాలజీ, ఆర్ ఐసీయూ తదితర వార్డులను పరిశీలించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీకుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, వైద్యులు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో రెండు ప్రమాదాలు

- ఇద్దరు మహిళలు, ఓ బాలుడికి గాయాలు





బోల్తా పడిన కారు, రక్షణగోడను ఢీకొన్న బస్సు



గాయపడిన బాలుడు

తిరుమల : తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో వేర్వేరు చోట్ల ఆదివారం రెండు ప్రమాదాలు జరిగాయి. ఇద్దరు మహిళలు, ఓ బాలుడు గాయాలపాలయ్యారు. వివరాలు.. చిత్తూరు జిల్లా కలకడకు చెందిన మల్లికార్జునరావు కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థం కారులో తిరుమలకు చేరుకున్నారు. తిరుగుప్రయాణంలో జింకల పార్కు వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పొదల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న హర్షవర్ధన్‌రావు అనే బాలుడు స్వల్పంగా గాయపడ్డాడు. అలాగే తిరుమల నుంచి తిరుపతికి వస్తున్న ఆర్టీసీ బస్సు మొదటి ఘాట్‌రోడ్డులో ఏడో మైలు వద్ద అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు గాయపడ్డారు. ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రికి తరలించారు. తిరుమల ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బకాయిలు విడుదలకు డిమాండ్



సమావేశంలో ఏపీటీఎఫ్ నేతలు

తిరుపతి ఎడ్యుకేషన్ : కూటమి ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడిచినా ఇప్పటి వరకు బకాయిలు విడుదల చేయకపోవడం దారుణమని, వెంటనే పెండింగ్ నగదు చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం కరకంబాడి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. పీఎఫ్, ఏ పీజీఎల్ఐ, సరెండర్ సెలవు, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేసి, కారుణ్య నియామకాలను చేపట్టాలని, 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలుచేయాలని స్పష్టం చేశారు. తమ డిమాండ్‌లను నెరవేర్చకుంటే పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అదనపు కార్యదర్శి జి.చెంగల్రాయ మందడి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రమేష్, ఎస్.సురేష్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ఎం.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ ల్యాబ్ ప్రారంభం



వర్చువల్ గా ప్రారంభిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

తిరుపతి క్రైమ్: తిరుపతిలో రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ 1, 2 భవనాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా వర్చువల్‌గా ఆదివారం ప్రారంభించారు. విజయవాడ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, డీజీపీ ద్వారకా తిరుమలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ఇకపై తిరుపతిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లోనే వివిధ కేసులకు సంబంధించిన డీఎన్ఏ శాంపిళ్లను టెస్ట్ చేయనున్నట్టు తెలిపారు. అలాగే ఆడియో, వీడియో, టేపులకు సంబంధించి ఆధారాల సేకరణ సైతం చేపట్టనున్నట్లు వెల్లడించారు. సైబర్ నేరాలను దృష్టిలో ఉంచుకుని నిశిత పరిశీలనకు ఈ ల్యాబ్ ఉపయోగపడుతుందని వివరించారు. ఇది వరకు ఈ పరీక్షలకు విజయవాడకు పంపాల్సి వచ్చేదని, ఇకపై తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు సంబంధించి నేర నిరూపణ ప్రక్రియ వేగవంతమవుతుందన్నారు. పది రోజుల్లోపే ఫలితాలు వచ్చే అవకాశముంటుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, జేడీ వి.ఈశ్వరమ్మ, డీఎస్పీలు తిరుపతి వెంకటనారాయణ, ఎస్పీ గిరిధర్ పాల్గొన్నారు.

తిరుపతిలో 'సంక్రాంతికి వస్తున్నాం'

థియేటర్‌లో చిత్ర యూనిట్ సందడి



మాట్లాడుతున్న అనిల్ రావిపూడి

తిరుపతి కల్చరల్: సంక్రాంతి పండుగకు విడుదలైన సంక్రాంతికి వస్తున్నాం సినిమాకు భారీ విజయం చేకూర్చిన ప్రేక్షకుల ఆదరణ మరువలేనిదని చిత్ర యూనిట్ వెల్లడించింది. దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత దిల్‌రాజు, హీరోయిన్లు మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్, సంగీత దర్శకుడు భీమ్స్, బాలనటుడు బుల్లిరాజు, నటుడు శ్రీనివాసులురెడ్డి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతిలో సినిమా ప్రదర్శిస్తున్న జయశ్యామ్ థియేటర్‌కు చేరుకున్నారు. వారికి నిర్మాత ఎన్వీ ప్రసాద్, టీటీడీ మాజీ డిప్యూటీ ఈఓ చిన్నంగారి రమణ, ఆర్‌సీ మునికృష్ణ ఘన స్వాగతం పలికారు. అనంతరం థియేటర్‌లో చిత్రం యూనిట్ సందడి చేసింది. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ సంక్రాంతికి వస్తున్నాం సూపర్ హిట్ కావడం సంతోషకరమన్నారు. ప్రేక్షకుల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని మంచి చిత్రాలు అందించి మన్ననలు అందుకుంటానని స్పష్టం చేశారు. చిరంజీవితో చేసే చిత్రంపై త్వరలోనే వివరాలు వెల్లడిస్తానన్నారు. హీరోయిన్లు మీనాక్షి చౌదరి, ఐశ్వర్య మాట్లాడుతూ శ్రీవారిని దర్శించుకుని తిరుపతిలో ప్రేక్షకుల మధ్యకు రావడం సంతోషంగా ఉందని చెప్పారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ సంక్రాంతికి వస్తున్నాం సినిమాను బ్లాక్‌బాస్టర్ చేసిన ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విక్టరీ వెంకటేష్ అభిమానులు హరీష్, ప్రకాష్, గుణ, మోహన్‌నాయుడు, ఉపేంద్ర, సుబ్బు యాదవ్, మధు పాల్గొన్నారు.

5 రోజుల పనిదినాలకు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్ రాంబాబు

తిరుపతి అర్బన్ : బ్యాంకు ఉద్యోగులకు 5 రోజులే పనిదినాలు ఉండే ప్రభుత్వం ప్రకటించాలని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ బీఎస్ రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి లీలామహల్ సర్కిల్ సమీపంలోని ఓ హోటల్‌లో బ్యాంక్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగులకు పనిభారం తగ్గించేందుకు వెంటనే ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అర్హత మేరకు ఉద్యోగోన్నతులు కల్పించాలని సూచించారు. కెనెరా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సంధానీ, అధ్యక్షుడు జేపీ శర్మ మాట్లాడుతూ బ్యాంకుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ పాండురంగ మితంతయ్య, తిరుపతి బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ధన్వంత్ కుమార్, కమిటీ జనరల్ సెక్రటరీ వి.బాబు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ మున్వర్ బాషా, వైస్ ప్రెసిడెంట్ లలిత పాల్గొన్నారు.

నేటి నుంచి రీసర్వే

- 11 నెలల తర్వాత పునఃప్రారంభం
- 33 మండలాల్లోని 33 గ్రామాల్లో శ్రీకారం



భూముల్లో నాటడానికి సర్వే రాళ్లు(ఫైల్)



భూ సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

తిరుపతి అర్బన్ : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రీసర్వే చేపట్టారు. గత ఏడాది ఫిబ్రవరి వరకు పకడ్బందీగా పలు గ్రామాల్లో పూర్తి చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సర్వేకు బ్రేక్ పడింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 7 నెలలకు రీసర్వే ప్రాధాన్యతను పాలకులు గుర్తించారు. ఈ క్రమంలో ముందుగా ఒక్కో మండలంలో ఒక్కో గ్రామం ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టుగా రీసర్వే చేపట్టాలని నిర్ణయించారు. ఆయా గ్రామాల్లో సర్వే పూర్తి చేసేందుకు 4 నెలల గడువు విధించారు. ఈ మేరకు సోమవారం నుంచి జిల్లాలోని 33 మండలాల్లోని 33 గ్రామాల్లో భూముల రీసర్వేను పునఃప్రారంభించనున్నారు. మొత్తం 20వేల ఎకరాలను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయనున్నారు.

వివాదాలు లేని గ్రామాల ఎంపిక

రీసర్వే తొలి దశలో గందరగోళం లేకుండా ఉండేందుకు భూ వివాదాలు లేని గ్రామాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. దీనిపై నెలపాటు కసరత్తు చేసి మరీ గ్రామాలను గుర్తించింది. రోజుకు 20 నుంచి 25 ఎకరాలు మాత్రమే సర్వే చేసేలా ఆదేశాలు జారీ చేసింది. అనంతరం సర్వే రాళ్ల ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే భూ హక్కు పత్రాలను పంపిణీ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని పేర్కొంది.

రైతులు సహకరించాలి



జిల్లాలో సోమవారం నుంచి భూముల రీసర్వే మొదలుపెట్టనున్నాం. ముందుగా పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మండలానికి ఒక గ్రామం ఎంపిక చేశాం. ఒక్కో సర్వే బృందంలో ముగ్గురు నుంచి నలుగురిని నియమించాం. అలాగే స్థానిక వీఆర్‌ఓ, వీఆర్‌ఏ, సర్వేయర్ ఉంటారు. రైతులు సైతం సర్వేకు సహకరించాలి. వారి సమస్యలను సర్వే బృందానికి తెలియజేయాలి.

– అరుణ్‌కుమార్, జిల్లా సర్వే విభాగం అధికారి

విధిగా నిబంధనలను పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్

రేణిగుంట(ఏర్పేడు): వాహనచోదకులు విధిగా రోడ్డు నియమాలు పాటించాలని జిల్లా రవాణాధికారి మురళీమోహన్ తెలిపారు. ఆయన ఆదివారం శ్రీకాళహస్తి ఎంవీఐ దామోదర్ నాయుడితో కలిసి ఏర్పేడు మండలం మేర్లపాక టోల్ గేట్ సమీపంలో ఆటోలను తనిఖీ చేశారు. రోడ్డు భద్రతపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. రికార్డులు కచ్చితంగా ఉండాలని పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల నుంచి జాతీయ రహదారి కలిసే చోట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.